క్లుప్తంగా

నేడు సిరిసిల్లలో అగ్నిమాపక ర్యాలీ

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక ర్యాలీ నిర్వహిస్తున్నామని సిరిసిల్ల ఫైర్ ఆఫీసర్ నరేందర్ శనివారం తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గాంధీచౌక్ నుంచి నేతన్నచౌక్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



సిరిసిల్లటౌన్: ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ జిల్లా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ నల్ల మధు, ప్రధాన కార్యదర్శి తడుక సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని సీనియర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కందేపి ప్రసాద్‌రావు, డాక్టర్ మురళీకృష్ణ అభినందించారు. పిల్లల వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

సిరిసిల్లటౌన్: పేదల సంక్షేమమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని ఆపార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమం శనివారం ఆయన ప్రారంభించారు. 23, 24,29,30, 31,32,17,18,19 వార్డుల్లో గడపగడపకూ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్లమెంట్ కో– కన్వీనర్ ఆడెపు రవీందర్, కొండ నరేశ్, సుంకోజు రమేశ్ చారి, పంపరి అర్జున్, వేముల వైశాలి, కర్నే హరీష, రావుల శరత్, చేపూరి అశోక్, అన్నల్దాస్ వేణు, గుడ్ల విష్ణు, కోడం రవి, తాటిపాముల విష్ణు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

23న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్నకు భక్తులు హుండీలలో సమర్పించుకున్న కట్నాలు, కానుకలను ఈనెల 23న ఓపెన్‌స్లాబ్‌లో లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ముస్తాబాద్: వడగళ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. మద్దికుంటలో వడగళ్లతో దెబ్బతిన్న వరిపంట, మామిడితోటలను శనివారం శరత్‌రావు పరిశీలించారు. ఎకరానికి రూ.25వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సడిమెల ఎల్లం, భూమయ్య, జింక తిరుపతి, స్వామిగౌడ్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అందిస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అందుబాటులోకి తెస్తామని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మండలంలో నెల రోజులుగా ఇసుక దొరకక సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సోమవారం నుంచి యథావిధిగా రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు ఇప్పించి ఇసుక అందిస్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకుని ఇసుకను వాహనాల్లో తరలించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఎస్‌కే గౌస్, బుచ్చాగౌడ్, రాజేందర్, బండారి బాల్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, రాములు, బాబు, నర్సింలు తదితరులున్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: తలిదండ్రులు దేవతలతో సమానమని ప్రధానోపాధ్యాయుడు బూర రవీందర్ అన్నారు. మండలంలోని తాడూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు వారి తలితండ్రులకు పాదపూజ చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు మనోహర్, రఘుపతి, భాస్కర్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించండి

ఇల్లంతకుంట: గతేడాది జూన్‌లో రిటైరైనా ఇప్పటివరకు తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని మండల రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్ రహీమున్నీసా బేగం శనివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. కలెక్టర్ తను ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడతానని తెలిపారు.

30 పడకలకు అడుగులు

- రుద్రంగిలో 30 పడకల ఆస్పత్రి భవనం
- దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ
- హర్షం వ్యక్తంచేస్తున్న మండల ప్రజలు



రుద్రంగిలో కొనసాగుతున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు

రుద్రంగి: మండలకేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మండల ప్రజల దశాబ్దాల కల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి రుద్రంగి ప్రజలకు చేరువవుతుంది. దీంతో మారుమూల ప్రాంత నిరుపేదలకు సర్కార్ వైద్యం దరిచేరనుంది.

భూమిపూజకే పరిమితం..

గత పాలకులు మండలకేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఏళ్లుగా భూమిపూజకే పరిమితమైంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గౌడ్ గెలిచిన వెంటనే రుద్రంగి మండల ప్రజల కలను సాకారం చేస్తున్నారు.

రూ.1.43 కోట్లు మంజూరు..

రుద్రంగి ప్రజల చిరకాల వాంఛ అయిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రూ.1.43 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన పూర్తయి పనులు చకచకా సాగుతున్నాయి. త్వరలోనే రుద్రంగిలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు అందనున్నాయి. దీంతో ప్రజలు మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఉచిత వైద్యమే లక్ష్యం



రుద్రంగిలో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆస్పత్రిలో అన్ని వసతులతో ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతోం.

–ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

వేగంగా సాగుతున్నాయి



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రుద్రంగి ప్రజల కష్టాలు తెలిసి పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో పేదల ప్రజలకు ప్రభుత్వ ఉచిత వైద్య సేవలు అందనున్నాయి.

– కట్కూరి దాస్, రుద్రంగి

'ఆది'కి ప్రత్యేక కృతజ్ఞతలు



మండలకేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరగా పనులు జరిగేలా కృషిచేస్తున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. మండలకేంద్రంలో 30 పడకల ఆస్పత్రితో ఉచిత వైద్యసేవలు అంది మండల ప్రజలకు ఎంతోమేలు జరుగుతుంది.

– తరై లింగం, రుద్రంగి

కిడ్నీ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

- మెడికల్ క్యాంపు సందర్శనలో డీఎంహెచ్‌వో రజిత



క్యాంపును సందర్శించిన డీఎంహెచ్‌వో రజిత

వేములవాడరూరల్: కిడ్నీ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.రజిత సూచించారు. వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో శనివారం నిర్వహించిన కిడ్నీ మెడికల్ క్యాంప్‌ను శనివారం సందర్శించారు. డీఎంహెచ్‌వో రజిత మాట్లాడుతూ కిడ్నీవ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్యూరిఫైడ్, గోరు వెచ్చని నీరు తాగాలని సూచించారు. 105 మందిని పరీక్షించగా అనుమానిత 10 మంది రక్తనమూనాలను తెలంగాణ డయాగ్నోస్టిక్‌కు పంపించినట్లు తెలిపారు. వైద్యులు లహరి, విశ్వేశ్వర్, మధు ప్రవంచ, ప్రసూన, బాలయ్య, గంగంరాజు, రాజయ్య, సూపర్ వైజర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం



ఆలయ ధర్మకర్తలను సన్మానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల: పట్టణంలోని శ్రీ విశ్వనాథ స్వామి ఆలయ ధర్మకర్తల మండలిని కాంగ్రెస్ పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శనివారం సన్మానించారు. ఇటీవల దేవాదాయ శాఖ సిరిసిల్ల విశ్వనాథ స్వామి ఆలయ కమిటీని నియమించింది. కొత్తగా నియమితులైన ఆలయ చైర్మన్ చేపూరి జనార్దన్, ధర్మకర్తలు ఇరుకుల్ల నాగరాణి, కోడం శ్రీదేవి, సిరిగిరి నవత, లక్ష్మీనారాయణ, జి.వెంకటేశ్వర్లును మహేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఆలయ అభివృద్ధికి పాటుపడాలని, భక్తులకు వసతులు కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు గడ్డం నర్సయ్య, గోనె ఎల్లప్ప, కల్లూరి చందన, చెన్నమనేని కమలాకర్‌రావు, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఓపెన్ స్కూల్ 'పది' పరీక్షలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు) గీతానగర్, సిరిసిల్ల, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం సిరిసిల్లలో కుసుమ రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల శివనగర్, వేములవాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు వేములవాడలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 298 మంది విద్యార్థులు పదో తరగతి విద్యార్థులు, 856 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు హాజరుకానున్నట్లు తెలిపారు.

లోన్ ఇప్పిస్తానని మోసం.. వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పిస్తానని మోసంచేసి ఇరువురి వ్యక్తుల వద్ద డబ్బులు కాజేసిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. పెద్ద లింగాపూర్‌కు చెందిన అమ్ముల అశోక్ వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంటల మల్లయ్యకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇప్పిస్తానని ఖర్చుల కోసం రూ.50వేలు తీసకున్నాడు. రెండునెలల తర్వాత నకిలీ ప్రొసీడింగ్స్ ఇచ్చాడు. వంతడుపులకు చెందిన బోయిని పరుశురాం వద్ద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్ ఇప్పిస్తానని రూ.50వేలు తీసుకున్నాడు. ప్రొసీడింగ్స్ నకిలీవని తేలడంతో బాధితులు అశోక్‌ను తమ డబ్బులు ఇవ్వాలని అడిగారు. దీంతో డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అశోక్‌ను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు

అధిక వడ్డీలు వసూలు చేసిన వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్‌కు చెందిన రంగు శ్రీనివాస్ అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తుండగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం రూ.20వేల జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. శ్రీనివాస్ అధిక వడ్డీలకు రుణం ఇస్తున్నాడన్న సమాచారంతో 2024లో అతని ఇంట్లో సోదాచేయగా విలువైన ప్రామిసరీ నోట్స్ డాక్యుమెంట్స్ లభించగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణ చేపట్టి రూ. 20వేల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య సమాజం



ముస్తాబాద్: మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం



బోయినపల్లి: జగ్గారావుపల్లెలో ప్రతిజ్ఞ..

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

ముస్తాబాద్/తంగళ్లపల్లి: పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గూడెం, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామాల్లో శనివారం నిర్వహించిన పోషణ్ అభియాన్ పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ అంజలి, దేవిక, టీచర్లు పద్మ, స్రవంతి, అనురాధ, రేణుక, యశోద, కిరణ్మయి, భారతి, బాబు జగ్జీవన్ కళాశాల సహాయ ఆచార్యులు మాధవి, అరుణ్‌బాబు, ఉమారాణి, సుష్మిత పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్ అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలోని తిప్పాపూర్, వెల్జీపూర్, అనంతారం, పెద్ద లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ వివరించారు. గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు గోలి లక్ష్మి, బండారి మంగా, చల్లవాణి, రమాదేవి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు

బోయినపల్లి: మండలంలోని జగ్గారావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం సందర్భంగా పోషకాహార లోపం గూర్చి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఎల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. రాచర్లబొప్పాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు యోగాసానాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయుష్ సిబ్బంది, ఫార్మసిస్ట్, యోగా శిక్షకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కోనరావుపేట: గర్భిణులు యోగా పద్ధతులను అవలంభించి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆయుర్వేద వైద్యాధికారి కల్యాణి పేర్కొన్నారు. నిజామాబాద్‌లో, కోనరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. యోగా శిక్షకులతో అవగాహన కల్పించారు. ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌందర్య, అంగన్‌వాటీ టీచర్ శ్యామల, యోగా శిక్షకులు అశోక్, పుష్పలత, ఆశా కార్యకర్తలు జమున, అనురాధ, పాల్గొన్నారు.

- ఘనంగా వార్షికోత్సవం



వేములవాడరూరల్: పట్టణంలోని శాత్రాజుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. తరగతుల వారిగా చదువులో ప్రతిభ కనబరిచి, మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. లావణ్య ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ బి. సుమలత, స్టాఫ్ సెక్రటరీ జి.రజిని, కల్చరల్ కోఆర్డినేటర్ ఎస్. సంధ్యారాణి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

- ఇంటర్వ్యూలు

వీర్నపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఓబీసీ, మైనార్టీలకు మండల ప్రత్యేకాధికారి రాందాస్, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ ఆధ్వర్యంలో శనివారం రాజీవ్ యువవికాసం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. తహసీల్దార్ ముక్తర్ పాషా, ఏపీఎం నర్సయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: తమ గ్రామ చెరువు నుంచి ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారంటూ గ్రామస్తులు శనివారం టిప్పర్లను అడ్డుకున్నారు. మండలం మర్రిపల్లిలో గ్రామ చెరువు నుంచి తరలిస్తున్న మట్టి టిప్పర్లను అడ్డుకోగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ పనుల అనుమతుల పేరుతో మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారన్నారు. వెంటనే మట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

- చర్యలు తీసుకోవాలి

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో కొందరు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఓ బిల్డింగ్ డిస్మెంటల్‌కు అనుమతులు తీసుకొని బిల్డింగ్ కింద నున్న మట్టిని అక్రమంగా తవ్వి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు తెలిపారు. అధికారులు మాత్రం చూసీనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

- ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- సిరిసిల్ల ఫైర్ ఆఫీసర్ నరేందర్



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సిరిసిల్ల: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని సిరిసిల్ల ఫైర్ ఆఫీసర్ నరేందర్ పేర్కొన్నారు. అగ్నిమాపకవారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని సినిమా థియేటర్లు, షాపింగ్‌మాల్స్‌లో అవగాహన కల్పించారు. నరేందర్ మాట్లాడుతూ చిన్నపాటి అజాగ్రత్త భారీ నష్టాన్ని కలిగిస్తుందన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు. షాపింగ్ మాల్స్‌లలో అగ్నిప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా థియేటర్లతోనూ అప్రమత్తత అవసరమని తెలిపారు. రాధామాధవ్ షాపింగ్ మాల్ నిర్వాహకులు వంశీ, శోభన్, థియేటర్ల నిర్వాహకులు రవి, వెంగయ్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పాక్షిక సేవలతోనే గుర్తింపు

- జిల్లా జడ్జికి న్యాయవాదుల ఆత్మీయ సత్కారం



ప్రధాన న్యాయమూర్తి ప్రేమలతను సత్కరిస్తున్న న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: ప్రజలకు అందించే నిష్పాక్షిక సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పలువురు న్యాయమూర్తులు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. వివిధ కోర్టుల న్యాయమూర్తులు లక్ష్మణాచారి, ప్రవీణ్, సృజన, మేఘన, జ్యోతిర్మయి సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు జూపెల్లి శ్రీనివాసరావు, గుండ రవి, సిరిసిల్ల కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, పుష్పలత తదితరులు మాట్లాడారు. మూడేళ్ల పదవీ కాలంలో రికార్డు స్థాయిలో 919 కేసులు పరిష్కరించారని ప్రశంసించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత మాట్లాడుతూ న్యాయమూర్తిగా తన మూడేళ్ల కాలం సంతృప్తినిచ్చిందన్నారు. ఉద్యోగులు, న్యాయవాదుల సహకారంతోనే జిల్లాకు నూతన కోర్టు భవనం మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. సీనియర్ న్యాయవాదులు ఉమాశంకర్, శాంతి ప్రకాశ్‌శుక్ల, నాగుల సత్యనారాయణ, కోడం సురేశ్, ధర్మేందర్, రవీందర్‌రావు, మహేశ్‌గౌడ్, ఆడెపు వేణు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

చందుర్తి: ఈనెల 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పెరుక కమ్యూనిటీ హాల్‌లో నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వరంగల్ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ .. సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, నాయకులు బైరగోని రమేశ్, ఎండీ ఇస్మాయిల్, లింగంపల్లి కరుణాకర్, మాదాసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఇప్పుడు రేవంత్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, గుంటి శంకర్, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, నిమ్మ శ్రీనివాసరెడ్డి, కొనుకటి లచ్చిరెడ్డి, చిందం రమేశ్, నాగయ్య, మహ్మద్ అజ్జూ, రాజు, ముద్దం రవి, సాగర్, మల్లారెడ్డి, రమేశ్ తదితరులు ఉన్నారు.

రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



కూలిన మామిడిచెట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ముస్తాబాద్: ఫసల్‌బీమా అమలు చేయకుండా ఎన్నికల్లో రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతులను పట్టించుకోవడం లేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి విమర్శించారు. ముస్తాబాద్ మండలం మద్దికుంటలో వడగండ్ల వానకు దెబ్బతిన్న మామిడి, వరిపంటలను శనివారం పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా పథకాన్ని అమలు చేస్తే నేడు రైతులకు నష్టపరిహారం వచ్చేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన, పంటలు పండకపోయిన పంటల బీమా ఉంటే రైతులకు మేలు జరిగేదన్నారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, రైతుభరోసా సగంలోనే ఆగిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండలాధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, వరి వెంకటేశ్, క్రాంతి, నరేశ్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సత్యం, సత్తయ్య, మహేందర్, కృష్ణ తదితరులున్నారు.

విజయవంతం చేయండి

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న రైతు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ మహోత్సవంలో రైతులు పండించిన వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తుల ప్రదర్శన కోసం 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్త సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై మూడు రోజులు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లానుంచి రైతులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బండారి బాల్‌రెడ్డి, ఎడ్ల రాజుకుమార్, దేవేందర్ తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. ప్రమాదాలను నివారించాలని కోరుతూ.. శనివారం ఆర్‌అండ్‌బీ ఈఈ నిఖిల్‌కు వినతిపత్రం అందించారు. కామారెడ్డి– సిరిసిల్ల ప్రధాన రహదారిపైనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతంలో కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

గుండారంలో డీఎస్పీ విచారణ

ఎల్లారెడ్డిపేట: ఇద్దరు పిల్లలు పుట్టాక తన భర్త ముఖం చాటేశాడని భార్య ఫిర్యాదుతో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మండలంలోని రాచర్ల గుండారంలో విచారణ చేపట్టారు. బాధితురాలు తెలిపిన వివరాలు. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం రాసినముకు చెందిన మొత్తం భవితకు, గుండారం గ్రామానికి చెందిన దేవేంద్రతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరికి 2016లో వివాహం కాగా.. 2017లో భర్త దుబాయ్ వెళ్లాడు. భార్యను సైతం దుబాయ్ రప్పించుకున్నాడు. 2017లో భవిత తండ్రి నరసింహులు మృతిచెందాడు. దుబాయ్ నుంచి వచ్చిన దేవేంద్ర భార్యను వదిలి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలోనే భవితను అత్త, ఆడపడుచు కులం పేరిట వేధింపులకు గురిచేశారు. విసిగిపోయిన భవిత గత మార్చిలో వికారాబాద్ మహిళా ఠాణాలో భర్త దేవేంద్రతోపాటు అత్త, ఆడపడుచుపై ఫిర్యాదు చేసింది. దేవేంద్ర కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదుకావడంతో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గుండారంలో విచారణ చేపట్టారు.